నేటి నుంచి శరన్న నవరాత్రోత్సవాలు

- మండపాల్లో కొలువుదీరనున్న అమ్మవారు
- తిరుచానూరులో 10 రోజులపాటు కల్యాణోత్సవం సేవ రద్దు

హైదరాబాద్, అక్టోబర్ 2 (నమస్తేతెలంగాణ): నేటి నుంచి దసరా శరన్నవరాత్రి ఉత్సవాలు ప్రారంభం కానున్నాయి. ఉత్సవాలకు అమ్మవారి ఆలయాలు, మండపాలు ముస్తాబయ్యాయి. భక్తులు తొమ్మిది రోజులపాటు తీరొక్క అవతారంలో దర్శనమిచ్చే అమ్మవారికి భక్తి ప్రపత్తులతో పూజలు నిర్వహించనున్నారు. తిరుచానూరులోని పద్మావతి అమ్మవారి ఆలయంలో నేటి నుంచి 12వ తేదీ వరకు నవరాత్రి ఉత్సవాలు నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా ప్రతిరోజూ మధ్యాహ్నం 3గంటలకు శ్రీకృష్ణ స్వామి ముఖ మండపంలో పద్మావతి అమ్మవారి ఉత్సవర్లకు స్నపన తిరుమంజనం వేడుకగా నిర్వహిస్తామని టీటీడీ అధికారులు వెల్లడించారు. 12న విజయదశమిని పురస్కరించుకొని రాత్రి 7:45 గంటలకు పద్మావతి అమ్మవారు గజ వాహనంపై ఊరేగి భక్తులకు దర్శనమిస్తారని చెప్పారు. కాగా, నవరాత్రి ఉత్సవాల కారణంగా 10 రోజులపాటు కల్యాణోత్సవం సేవను రద్దు చేసినట్టు అధికారులు పేర్కొన్నారు. 4, 11వ తేదీల్లో లక్ష్మీపూజ, 12న ఊంజల సేవలను రద్దు చేసినట్టు వివరించారు.

రాష్ట్రంలో రౌడీల పాలన!

- పట్టపగలే కేటీఆర్ హత్యకు కుట్ర
- సీఎం రేవంత్‌రెడ్డి కుట్రలో పోలీసులు పావులు
- నిందితులను ఎందుకు అరెస్టు చేయలే?
- సీఎం ధనదాహానికి హైడ్రా ఆయుధం
- మంత్రి కొండా సురేఖ వెంటనే క్షమాపణ చెప్పాలి
- బీఆర్ఎస్ నేత ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ ఆగ్రహం

మాట్లాడుతున్న బీఆర్ఎస్ నేత ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్, పక్కన రాకేశ్‌రెడ్డి, పల్లె రవికుమార్

హైదరాబాద్, అక్టోబర్ 2 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలో రౌడీల పాలన, గూండాల పాలన, రాక్షస పాలన సాగుతున్నదని బీఆర్ఎస్ నేత డాక్టర్ ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. పట్టపగలే నట్టనడి నగరంలో ప్రధాన ప్రతిపక్ష నేత కేటీఆర్‌పై హత్యకు కుట్ర పన్నారని విమర్శించారు. ప్రపంచ బ్యాంకుతో రేవంత్‌రెడ్డి కుమ్మక్కై మూసీ సుందరీకరణ పేరుతో రూ.లక్షా 50 వేల కోట్ల అవినీతికి తెరలేపారని, ఆ కుట్రను బీఆర్ఎస్ అడ్డుకున్నది కాబట్టే కేటీఆర్ కాన్వాయ్‌పై కాంగ్రెస్ కార్యకర్తలు దాడిచేశారని మండిపడ్డారు. హైదరాబాద్ నగర యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు మోతె రోహిత్ ఆధ్వర్యంలో కేటీఆర్ కాన్వాయ్‌పై జరిగిన దాడిని తీవ్రంగా ఖండిస్తున్నామని చెప్పారు. రేవంత్‌రెడ్డి ధన దాహానికి హైడ్రా ఆయుధంలా మారిందని, ఆయన బండారం త్వరలో బట్టబయలు అవుతుందని పేర్కొన్నారు. రేవంత్ రహస్య ఒప్పందాలను త్వరలోనే బయటపెడతామని హెచ్చరించారు. శ్రీలంకలో రాజపక్సే సోదరులపై ప్రజలు తిరుగుబాటు చేసినట్టు తెలంగాణలో రేవంత్‌రెడ్డిపై తిరుగుబాటు తప్పదని అన్నారు. బుధవారం తెలంగాణభవన్‌లో ఆయన మీడియాతో మాట్లాడుతూ.. పట్టపగలు కేటీఆర్ కాన్వాయ్‌పై దాడికి పాల్పడితే పోలీసులు ఎందుకు అడ్డుకోలేకపోయారని, పోలీస్ ఇంటెలిజెన్స్ వ్యవస్థ ఎటుపోయిందని నిలదీశారు. దాడి ఘటన వ్యవహారంలో పోలీసుల వైఖరి అనుమానాస్పదంగా ఉన్నదని ఆరోపించారు. సీఎం రేవంత్‌రెడ్డి కుట్రకు పోలీసులు పావులు అవుతున్నారని చెప్పారు. దాడి జరిగి 26 గంటలైనా నిందితులను పోలీసులు ఎందుకు అరెస్టు చేయలేదని నిలదీశారు. తానే కేటీఆర్ కాన్వాయ్‌ను అడ్డుకున్నట్టు ట్వీట్ చేసినా రోహిత్‌ను ఎందుకు అదుపులోకి తీసుకోలేదని ప్రశ్నించారు. పోలీసులు కాంగ్రెస్‌కు కొమ్ము కాస్తున్నారా? అని నిలదీశారు.

బీఆర్ఎస్ నేతలపై వరుస దాడులు

కాంగ్రెస్ రాక్షస పాలనతో ప్రతిపక్ష నేతల ఇండ్లు, కార్యాలయాలపై దాడులు నిత్యకృత్యంగా మారాయని, పదేండ్ల బీఆర్ఎస్ పాలనలో తాము ఏనాడూ ఇలా దాడులకు పాల్పడలేదని ప్రవీణ్‌కుమార్ గుర్తుచేశారు. తాజాగా తెలంగాణభవన్ వద్దకు కాంగ్రెస్ నేతలు వచ్చి దిష్టిబొమ్మ దహనానికి యత్నించగా, అడ్డుకున్న బీఆర్ఎస్ కార్యకర్తలపైనే పోలీసులు కేసులు పెట్టారని మండిపడ్డారు. తమ పార్టీ ఆఫీసుపై దాడికి వచ్చిన వారిపై పోలీసులు కేసు నమోదు చేయలేదని, పోలీసులు ఈ వివక్ష ఎందుకు చూపుతున్నారని ప్రశ్నించారు. తెలంగాణ ఉద్యమ సమయంలో, పదేండ్ల పాలనలో బీఆర్ఎస్ నేతలు ఏనాడూ ఇతర పార్టీల కార్యాలయాల్లోకి వెళ్లలేదని గుర్తుచేశారు. కానీ, సిద్దిపేటలో హరీశ్‌రావు క్యాంపు కార్యాలయంపై, పాడి కౌశిక్‌రెడ్డిపై ఇంటిపై కాంగ్రెస్ నేతలు దాడి చేశారని ఆగ్రహం వ్యక్తంచేశారు. మూసీ సుందరీకరణ పేరుతో కాంగ్రెస్ చేస్తున్న రూ.1.50 లక్షల కోట్ల అవినీతిని బీఆర్ఎస్ నాయకులు అడ్డుకుంటున్నందునే దాడులు చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తంచేశారు. రేవంత్‌రెడ్డి ప్రపంచ బ్యాంకు వైపు ఉంటే.. బీఆర్ఎస్ పీడిత ప్రజల పక్షాన ఉన్నదని చెప్పారు. కేటీఆర్, హరీశ్‌రావు, బీఆర్ఎస్ నేతలపై ఎన్ని దాడులు చేసినా ప్రజల పక్షాన పోరాటాలు చేస్తూనే ఉంటామని స్పష్టంచేశారు. ప్రపంచ బ్యాంకు ఏజెంట్లు ఎన్ని దాడులు చేసినా ఎదుర్కొంటామని తేల్చిచెప్పారు. బీఆర్ఎస్ నేతలు, కార్యకర్తలు సంయమనంతో వ్యవహరిస్తున్నారని, ఓపికకూ ఒక హద్దు ఉంటుందని పేర్కొన్నారు.

రేవంత్‌వి అటెన్షన్ డైవర్షన్ పాలిటిక్స్

రేవంత్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ అటెన్షన్ డైవర్షన్ పాలిటిక్స్ చేస్తున్నట్టు ప్రవీణ్‌కుమార్ విమర్శించారు. హైడ్రాపై ప్రజల్లో వ్యతిరేకత వస్తున్నందున కొండా సురేఖతో అసంబద్ధమైన వ్యాఖ్యలు చేయిస్తున్నారని మండిపడ్డారు. ఆమె వ్యాఖ్యలు కాంగ్రెస్ నీచ సంస్కృతికి నిదర్శనమని ఆగ్రహం వ్యక్తంచేశారు. సురేఖ తన వ్యాఖ్యలపై మహిళాలోకానికి క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. ఆమె తన వ్యాఖ్యలను వెనక్కి తీసుకోవాలని సూచించారు. సురేఖకు మంత్రివర్గంలో ఉండే అర్హత లేదని, ఆమె వ్యాఖ్యలపై లీగల్‌గా ముందుకు వెళ్తామని చెప్పారు. సమావేశంలో బీఆర్ఎస్ నాయకులు పల్లె రవీందర్, గెల్లు శ్రీనివాస్‌యాదవ్, ఏనుగుల రాకేశ్‌రెడ్డి, తుంగ బాలు, నరేందర్, రాజు పాల్గొన్నారు.

ఐఏఎస్ అధికారి రాహుల్ బొజ్జా తల్లి విజయభారతి అనారోగ్యంతో ఇటీవల మరణించగా బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ వారి నివాసానికి వెళ్లి కుటుంబసభ్యులను పరామర్శించారు. కేటీఆర్ వెంట ఎమ్మెల్యేలు జగదీశ్ రెడ్డి, కౌశిక్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్, పార్టీ నాయకులు ఉన్నారు.

గౌతమ్ అదానీతో పొంగులేటి భేటీ

మొదటిపేజీ తరువాయి...

భేటీనా? ప్రభుత్వం తరపున జరిగిన భేటీనా? అన్నదానిపై స్పష్టత లేదు. వీరిద్దరితోపాటు కాంగ్రెస్ పార్టీకి సోషల్ మీడియా కన్సల్టెంట్‌గా ఉన్న సునీల్ కొనుగోలు కూడా ఉన్నారని విశ్వసనీయంగా తెలిసింది. సుమారు గంటకుపైగా పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, గౌతమ్ అదానీ మధ్య సమావేశం జరిగినట్టు చెప్తున్నారు. పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డితో సమావేశం అనంతరం అదానీ తిరిగి వెళ్లినట్టు తెలిసింది. అయితే, భేటీపై రాష్ట్రప్రభుత్వం, మంత్రి పొంగులేటి, అదానీ గ్రూప్ నుంచి ఎలాంటి ప్రకటన రాలేదు. ఒకవైపు జాతీయస్థాయిలో అదానీపై కాంగ్రెస్ సీనియర్ నేత రాహుల్‌గాంధీ తీవ్ర విమర్శలు చేస్తుండగా, సీఎం రేవంత్ దావోస్‌లో అదానీలో ఒప్పందాలు చేసుకోవటం, నంబర్ 2గా చెప్పుకుంటున్న పొంగులేటి.. ఆయనతో రహస్య భేటీ కావటం రాజకీయంగా పెద్ద చర్చ జరుగుతున్నది. రాష్ట్రంలో దోస్తీ.. దేశవ్యాప్తంగా కుస్తీ ఏమిటని ప్రశ్నలు తలెత్తుతున్నాయి. అదానీతో ఎందుకు అంటకాగుతున్నారని కాంగ్రెస్ పార్టీలోనూ పలువురు సీనియర్లు ఆగ్రహం వ్యక్తంచేస్తున్నారు.

ఎందుకు కలిశారు..?

అదానీ కంపెనీలతో రాష్ట్ర ప్రభుత్వం ఒప్పందం చేసుకోబోతున్నట్టు గతంలో ప్రభుత్వం ప్రకటించింది. కానీ, విమర్శలు రావడంతో ఒప్పంద వివరాలు మాత్రం వెల్లడించలేదు. అయితే, నగర శివారులో అతి పెద్ద భూమికి సంబంధించిన అంశంపై వీరి భేటీ జరిగినట్టు ప్రచారం జరుగుతున్నది. పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి కుటుంబానికి చెందిన ఓ కంపెనీని అదానీ సంస్థ తిరిగి కొనుగోలు చేస్తున్నదని.. ఆ కంపెనీ కొనుగోలు విషయంలో ఇద్దరు కలిశారని చెప్తున్నారు. అదానీతో తన కంపెనీకి సంబంధించిన డీల్ ఫైనల్ చేసుకోవడానికే పొంగులేటి కలిశారని, దానికోసం రాష్ట్రంలోని పలు కీలకమైన ప్రాజెక్టులు అదానీ గ్రూపునకు ఇచ్చే అంశంపైనా చర్చ జరిగినట్టు చెప్తున్నారు. సింగరేణి బొగ్గు గనులు, విద్యుత్తు కొనుగోలు ఒప్పందాలు, విద్యుత్తు ప్రాజెక్టులు తదితర వాటికి సంబంధించి కీలక చర్చలు జరిగినట్టు తెలిసింది. ప్రభుత్వం కూడా ఒక భారీ ప్రాజెక్టును అదానీకి కట్టబెట్టే ప్రయత్నం చేస్తున్నట్టు చెప్తున్నారు.

రాయదుర్గంలోని 84 ఎకరాలను కట్టబెట్టేందుకేనా?: కేటీఆర్

ఐటీసీ కోహినూర్‌లోని ప్రెసిడెన్షియల్ సూట్‌లో తెలంగాణ క్యాబినెట్‌లోని నంబర్-2తో అదానీ ఎందుకు సమావేశమయ్యారని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ 'ఎక్స్' వేదికగా ప్రశ్నించారు. ఇదే సమావేశంలో సునీల్ కనుగోలు కూడా ఉన్నారని, ఆయన ఏం చేస్తున్నారని అడిగారు. అదానీతో కాంగ్రెస్ దోస్తీ కట్టిందా? లేదంటే రాయదుర్గంలోని 84 ఎకరాల విలువైన ప్రభుత్వ భూమిని అదానీకి కట్టబెట్టే కుట్ర చేస్తున్నారా? అని నిలదీశారు.

9 నెలల్లో 842 కేసులు

దూకుడు పెంచిన ఎక్సైజ్‌శాఖ

హైదరాబాద్, అక్టోబర్ 2 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలో ఎక్సైజ్‌శాఖ ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగం దూకుడు పెంచింది. మాదకద్రవ్యాల అక్రమ రవాణా, అక్రమ మద్యం రవాణా, గంజాయి మూలాలను తుదముట్టించడంలో పైచేయి సాధించింది. తొమ్మిది నెలల కాలంలో 842 కేసులు నమోదుచేసింది. 1,445 మందిని అరెస్టుచేసింది. 364 వాహనాలను సీజ్‌చేసింది. ప్రత్యేకంగా సెప్టెంబర్ మాసంలోనే 43 కేసులు నమోదుకాగా, 134 మందిని అరెస్టుచేయడమే కాకుండా 715 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. జనవరి నుంచి సెప్టెంబర్ వరకు ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగం పనితీరుపై ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగం డైరెక్టర్ వీబీ కమలాసన్‌రెడ్డి బుధవారం సమీక్షించారు. మాదకద్రవ్యాల కట్టడికి కృషిచేసిన అధికారులను అభినందించారు.

9నెలల్లో పట్టుకున్నవి..

మాదక ద్రవ్యాలు	కేజీలు, గ్రాములు
గంజాయి	5214 కిలోలు
హషిష్ ఆయిల్	7.35కిలోలు
గంజాయి ఆయిల్	1.1కిలోలు
గంజాయి చాక్లెట్స్	72.66 కిలోలు
ఆల్ఫోజోలం	16.65 కిలోలు
ఆల్ఫోజోలం టాబ్లెట్స్	10.67 కిలోలు
డైజోఫాం	1.52 కిలోలు

పోలీస్‌స్టేషన్లలో దొంగలుపడ్డారు?

- ఠాణాల నుంచి బ్యాటరీ సైకిళ్లు మాయం!
- చోరీ అయ్యాయా..? చేతి వాటమా?
- ఆరా తీస్తున్న అధికారులు

హైదరాబాద్ సిటీబ్యూరో, అక్టోబర్ 2(నమస్తే తెలంగాణ): సైకిల్ పెట్రోలింగ్ కోసం బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో పోలీస్‌స్టేషన్లకు అప్పగించిన బ్యాటరీ సైకిళ్లు, హెల్మెట్లు కనిపించడం లేదు. ఆ సైకిళ్లు ఎక్కడున్నాయి? దొంగలు అపహరించారా? సిబ్బంది చేతివాటం ప్రదర్శించారా? అనేది ప్రస్తుతం సిటీ పోలీసుల్లో చర్చనీయాంశంగా మారింది. పెట్రోలింగ్ వ్యవస్థ పటిష్టతకు బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో హైదరాబాద్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో 130కిపైగా సైకిళ్లు వివిధ పోలీస్‌స్టేషన్లకు పంపిణీ చేశారు. ఒక్కో సైకిల్‌కు హెల్మెట్, ఫస్ట్ ఎయిడ్ కిట్, మ్యాన్‌ఫ్యాక్, లాఠీ, సైరన్, ఎల్ఈడీ లైట్, వాటర్ బాటిళ్లతో కూడిన కిట్‌ను కూడా అందజేశారు. కార్లు వెళ్లని ప్రాంతాల్లో సిబ్బంది బైకులు, సైకిళ్ల మీదుగా వెళ్లి బస్తీ, గల్లీలో పెట్రోలింగ్ నిర్వహించారు. సౌత్‌జోన్‌లోని ఠాణాలకు 13, సెంట్రల్ 24, వెస్ట్‌జోన్ 20, ట్రాఫిక్ ఠాణాలకు 50, ఎస్బీకి 19, సీపీ కార్యాలయానికి 9 సైకిళ్లను అందజేశారు. ఆ తర్వాత చైనా నుంచి కూడా సైకిళ్లను తెచ్చి సిబ్బందికి ఇవ్వగా, కొన్ని పాడైపోయాయి. ప్రభుత్వం మారింది, అధికారులు మారుతూ వచ్చారు. ఆ క్రమంలోనే చాలా సైకిళ్లు ఠాణాల నుంచి మాయమవుతూ వచ్చాయి. సైకిళ్లు పనిచేయకపోతే సిటీ ఆర్మూడ్ రిజర్వు ఫోర్స్(కార్) హెడ్ క్వార్టర్స్‌కు తరలిస్తుంటారు. తుక్కుగా అమ్మేశారా? అనే విషయం కూడా లెక్కల్లో లేదని సమాచారం.

సైకిళ్ల మాయంపై ఆరా...!

సైకిళ్లు మాయమవుతున్నాయనే విషయం ఉన్నతాధికారుల దృష్టికి వెళ్లింది. దీంతో ఎన్ని సైకిళ్లు పీఎస్‌లో ఉన్నాయి? అవి ఎక్కడికి పోయాయి? అనే విషయాన్ని తెలుసుకుంటున్నారు. కార్ హెడ్ క్వార్టర్స్ డీసీపీ రక్షిత మూర్తిని వివరణ కోరగా సైకిళ్లు ఎక్కడెక్కడున్నాయనే విషయంపై ఆరా తీస్తున్నామని తెలిపారు.

చిన్నారిపై వీధి కుక్కల దాడి

పెద్ద కొడప్‌గల్, అక్టోబర్ 2: కామారెడ్డి జిల్లా పిట్లం మండలం అల్లాపూర్ గ్రామంలో ఓ చిన్నారిపై వీధి కుక్కలు దాడిచేశాయి. గ్రామానికి చెందిన విఠల్‌రావు కూతురు వాణిశ్రీ బుధవారం ఆరుబయట ఆడుకుంటుండగా వీధి కుక్కలు దాడి చేశాయి. దీంతో చిన్నారి ముఖం, తలపై గాయాలయ్యాయి. తల్లిదండ్రులు వెంటనే దవాఖానకు తరలించి చికిత్స చేయించారు. కుక్కల బెడద తప్పించాలని స్థానికులు కోరుతున్నారు.

నృత్యాలు చేస్తున్న విద్యార్థినులు

ఘనంగా బతుకమ్మ సంబరాలు

బాసర, అక్టోబర్ 2 : బాసర ట్రిపుల్‌ఐటీలోని శాతవాహన గ్రౌండ్‌లో ట్రిపుల్ వుమెన్‌సెల్ ఆధ్వర్యంలో బుధవారం రాత్రి బతుకమ్మ సంబురాలు ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా వీసీ వెంకటరమణ పాల్గొన్నారు. దాదాపు మూడు వేల మంది విద్యార్థినులు బతుకమ్మ సంబురాల్లో పాల్గొని నృత్యాలు చేస్తూ ఉత్సవాల్లో పాల్గొన్నారు.

విద్యార్థి కళాశాలలో బతుకమ్మ వేడుకలు

ఎదులాపురం, అక్టోబర్ 2 : తెలంగాణ సంస్కృతిని చాటే పండుగ బతుకమ్మ అని అదనపు కలెక్టర్ శ్యామలాదేవి అన్నారు. బుధవారం మావలలోని విద్యార్థి కళాశాలలో బతుకమ్మ వేడుకలు నిర్వహించారు. దీనికి ఆమె హాజరై బతుకమ్మలకు పూజలు చేశారు. అనంతరం విద్యార్థులతో కలిసి బతుకమ్మల చుట్టూ తిరుగుతూ నృత్యాలు చేశారు. కార్యక్రమంలో కళాశాలల కరస్పాండెంట్ ప్రభాకర్ రెడ్డి, కోఆర్డినేటర్ వీణదేవి, వైస్ ప్రిన్సిపాల్ శ్రావణ్, లక్ష్మిరెడ్డి, శ్రీకాంత్ పాల్గొన్నారు.

భీంపూర్, అక్టోబర్ 2 : భీంపూర్ మండలం కరంజి(టీ), గోముత్రి, అంతర్గాం గ్రామాల్లో బుధవారం సాయంత్రం సమీప వాగులు, చిట్టడవుల నుంచి చెన్నంగి చెట్టును సంప్రదాయంగా తీసుకువచ్చారు. ఆచారం ప్రకారం తవ్విన బతుకమ్మ బాయిలో చెన్నంగి చెట్టును ప్రతిష్ఠించి దీపారాధన చేసి వేడుకలు ప్రారంభించారు. బతుకమ్మ బాయిలలో సూర్య, చంద్ర గద్దెలు వచ్చిన మహిళలను తోటి మహిళలు అభినందించారు.

దస్తురాబాద్, అక్టోబర్ 2 : మండలంలోని అన్ని గ్రామాల్లో బతుకమ్మ సంబురాలు ప్రారంభమయ్యాయి. మొదటి రోజు ఎంగిలి పూల బతుకమ్మతో బతుకమ్మ పండుగను మహిళలు ప్రారంభించారు. కార్యక్రమంలో మహిళలు, యువతులు, చిన్నారులు పాల్గొన్నారు.

జీవితంలో మరిన్ని విజయాలను సాధించాలి

షేక్ షరీన్ పర్వీన్‌ను సన్మానిస్తున్న ఎస్పీ గౌష్ ఆలం

ఎదులాపురం, అక్టోబర్ 2 : డీఎస్సీ, స్కూల్ అసిస్టెంట్ పోస్టుల ఫలితాలలో కానిస్టేబుల్ షేక్ ఇంజమాముల్ హక్ చెల్లెలు షేక్ షరీన్ పర్వీన్ రాష్ట్రంలోనే స్కూల్ అసిస్టెంట్ బయోసైన్స్ విభాగంలోని ఉర్దూ మీడియంలో 80.03 మార్కులతో మొదటి స్థానాన్ని కైవసం చేసుకున్నది. అదేవిధంగా డీఎస్సీ ఎస్జీటీలో79.00 మార్కులతో రెండవ స్థానాన్ని సాధించింది. ఈ విషయం తెలుసుకున్న ఆదిలాబాద్ ఎస్పీ గౌష్ ఆలం ఆమెను శాలువాతో సన్మానించి బహుమతి ప్రదానం చేసి అభినందించారు. జీవితంలో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో సీసీ దుర్గం శ్రీనివాస్, పోలీస్ అసోసియేషన్ అధ్యక్షుడు పెంచాల వెంకటేశ్వర్లు, ఏఎస్ఐ జైస్వాల్ కవిత, కుటుంబ సభ్యులు తండ్రి మెహబూబ్, అన్నయ్య షేక్ ఇంజమాముల్ హక్, తమ్ముడు ఇమ్రాన్ నజీర్, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థుల క్షేమమే ధ్యేయం

వైస్ ఛాన్స్‌లర్ వెంకటరమణ

మాట్లాడుతున్న వీసీ వెంకటరమణ

బాసర, అక్టోబర్ 2 : విద్యార్థుల క్షేమమే మా ధ్యేయమని ట్రిపుల్ ఐటీ ఇన్‌చార్జి వైస్ ఛాన్స్‌లర్ వెంకటరమణ అన్నారు. బుధవారం సాయంత్రం అడ్మినిస్ట్రేషన్ భవనంలో గల కాన్ఫరెన్స్ హాల్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. బాసర ట్రిపుల్‌ఐటీలో చదివే విద్యార్థులు చాలా ఉన్నత స్థాయికి ఎదిగారని, విద్యార్థుల కొరకు ప్రత్యేకంగా స్పోర్ట్ కమిటీని ఏర్పాటు చేసి వారికి స్పోర్ట్స్‌పై అవగాహన కల్పించి సరైన ఆట వస్తువులు త్వరలోనే తీసుకోస్తామన్నారు. అలాగే పలు కంపెనీలతో కూడా ఇప్పటికే అవగాహన ఒప్పందాలు చేశామని ప్రత్యేకంగా విద్యార్థినుల కోసం 100 కంప్యూటర్లతో ల్యాబ్‌ను ఏర్పాటు చేశామన్నారు. ట్రిపుల్‌ఐటీలో గల బిల్డింగ్‌లో పలు సమస్యలు ఉన్నాయని వీటి కొరకు ప్రత్యేకంగా నాలుగున్నర కోట్ల బడ్జెట్‌ను కేటాయించమని ప్రభుత్వాన్ని కోరామన్నారు. సైన్స్ ల్యాబ్‌ను ఎక్సామినేషన్ బిల్డింగ్ కోసం కూడా ప్రభుత్వానికి నివేదించామని తెలిపారు. ట్రిపుల్‌ఐటీలో మిషన్ భగీరథ ద్వారా విద్యార్థులకు తాగునీటిని అందిస్తున్నామన్నారు. త్వరలోనే ట్రిపుల్‌ఐటీలోని మెస్‌లకు టెండర్లు నిర్వహిస్తామని, దీని కొరకు ప్రత్యేకంగా కమిటీని ఏర్పాటు చేశామని పేర్కొన్నారు. అలాగే ట్రిపుల్‌ఐటీలో విద్యార్థిని విద్యార్థులకు వేర్వేరుగా ఫుడ్ కోర్టులకు టెండర్లు త్వరలోనే పిలుస్తామన్నారు. విద్యార్థినుల కోసం హాస్టల్‌లో కొన్ని సమస్యలు ఉన్నాయని, వాటిని త్వరలోనే మెరుగు పరుస్తామని అన్నారు. నవంబర్ చివరి వారంలో బాసర ట్రిపుల్‌ఐటీలో స్నాతకోత్సవాన్ని నిర్వహించనున్నట్లు తెలిపారు. దాదాపు 400 మంది విద్యార్థులకు పైగా పట్టాలను అందుకోనున్నట్లు తెలిపారు. ట్రిపుల్‌ఐటీలో ఫ్యాకల్టీ కొరత ఉందని, ఇటీవల కొందరు ఫ్యాకల్టీ పలు విభాగాల్లో ఉద్యోగాలు సాధించారని ఖాళీ అయిన ఆ స్థలాల్లో గెస్ట్ ఫ్యాకల్టీని నియమించామని, త్వరలోనే టీచింగ్, నాన్‌టీచింగ్ సిబ్బందిని సరిపోయే విధంగా ప్రణాళిక సిద్ధం చేయాలని ప్రభుత్వానికి నివేదించి త్వరలోనే భర్తీ చేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో వీసీ వెంకటరమణ, ఏవో రణదీర్, అసోసియేట్ డీన్ ఫర్ స్టూడెంట్ వెల్ఫేర్ నాగరాజు, కంట్రోలర్ ఆఫ్ ఎక్సామినర్ వినోద్, అసోసియేట్ డీన్ అకాడమిక్ ప్లానింగ్ ఆఫీసర్ చంద్రశేఖర్, చీఫ్ సెక్రటరీ ఆఫీసర్ రాకేశ్ పాల్గొన్నారు.

అహింస మార్గం ద్వారానే శాంతిని స్థాపించవచ్చు

పరిసరాలు పరిశుభ్రం చేస్తున్న చైర్మన్ ప్రేమేందర్

ఎదులాపురం, అక్టోబర్ 2 : మహాత్మా గాంధీజీ సూచించిన ప్రకారం అహింస మార్గం ద్వారానే శాంతిని స్థాపించవచ్చని ఆదిలాబాద్ మున్సిపల్ చైర్మన్ జోగు ప్రేమేందర్ పేర్కొన్నారు. గాంధీ జయంతి సందర్భంగా బుధవారం గాంధీ చౌక్‌లో ఆర్యవైశ్య సంఘం వారు ఏర్పాటు చేసిన వేడుకల్లో పాల్గొని గాంధీజీ విగ్రహానికి పాలాభిషేకంతో పాటు పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం గాంధీ పార్క్‌లో నివాళులర్పించారు. అలాగే లైన్స్ క్లబ్ ఆధ్వర్యంలో పలువురు మున్సిపల్ కార్మికులను సన్మానించారు. అనంతరం ఇందిరాప్రియదర్శిని స్టేడియం పరిసర ప్రాంతాల్లో చీపురు చేతపట్టి స్వచ్ఛ పరిశుభ్రత చేపట్టారు. మున్సిపల్ కార్యాలయంలో కార్మికులను సత్కరించారు. మున్సిపల్ కమిషనర్ ఖమర్ అహ్మద్, డీఎస్పీవో వెంకటేశ్వర్లు, డీఈ తిరుపతి, ఆర్ఐ వెంకటేశ్, లయన్స్ క్లబ్ కింగ్స్ అండ్ కాటన్ సిటీ అధ్యక్ష కార్యదర్శులు పుప్పాల నరేందర్ సత్యనారాయణ, గంగయ్య, రవీంద్ర, లైన్ లీడర్స్ మధుసూదన్ రావు, రమాకాంత్ రావు భగవాన్‌దాస్, ప్రేమరాజ్ పాల్గొన్నారు.

కేటీఆర్‌పై ఆరోపణలు చేస్తే సహించం



మాట్లాడుతున్న కిరణ్ కొమ్రేవార్

భైంసా, అక్టోబర్ 2 : మాజీ మంత్రి కేటీఆర్‌పై ఆరోపణలు చేస్తే సహించేదేలేదని బీఆర్ఎస్ ముథోల్ నియోజకవర్గ సమన్వయ కమిటీ సభ్యుడు డా. కిరణ్ కొమ్రేవార్ అన్నారు. బుధవారం భైంసాలో ఆయన విలేకరులతో మాట్లాడారు. మంత్రి కొండా సురేఖ నిరాధారణ ఆరోపణలు చేస్తున్నారని, నాగచైతన్య, సమంత విడాకులకు కేటీఆర్ ఎలా కారణమవుతారని ఇలాంటి ఆరోపణలు చేసే ముందు ఒకటి వందసార్లు ఆలోచించుకోవాలన్నారు.దేవాదాయ శాఖ మంత్రిగా ఉన్న కొండా సురేఖ దేవాలయాల అభివృద్ధిపై దృష్టి పెట్టాలని, ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన బాసర అమ్మవారి ఆలయాభివృద్ధిని పట్టించుకోవడం లేదన్నారు. కాంగ్రెస్ సర్కార్‌పై ప్రజా వ్యతిరేకత మొదలైందని, ఇప్పటి వరకు దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ ఆలయానికి రాకపోవడం బాధాకరమన్నారు. వెంటనే మంత్రి సురేఖ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు.

పుకార్లను నమ్మవద్దు

భైంసా, అక్టోబర్ 2 : పుకార్లను నమ్మవద్దని ఎస్పీ జానకి షర్మిల అన్నారు. బుధవారం భైంసా పోలీస్‌స్టేషన్‌లో ఆమె విలేకరులతో మాట్లాడారు. కుభీర్ మండలానికి చెందిన ఓ యువకుడు మైనర్ అమ్మాయిని భైంసా పట్టణానికి తీసుకరాగా ఈ విషయమై స్థానికంగా కొంచెం స్వల్ప వివాదం జరగడంతో ఈ విషయం తెలుసుకున్న ఎస్పీ భైంసాకు చేరుకుంది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జిల్లాలో 30 యాక్ట్ అమలులో ఉన్నందున ఎవరూ కూడా దీనిని ఉల్లంఘించే పనులు చేయవద్దని సూచించారు. అంతేగాకుండా కుభీర్ ఘటన విషయమై పూర్తి వివరాలు సేకరించామని అమ్మాయి, అబ్బాయిలు ఇద్దరు సురక్షితంగా ఉన్నట్లు తెలిపారు.

స్టీల్ ప్లేట్స్ వాడుతాం

కుంటాల, అక్టోబర్ 2 : గాంధీ జయంతి సందర్భంగా కుంటాల మండలం ఓలా గ్రామ పంచాయతీ నందు మహిళా సంఘాలతో సమావేశం నిర్వహించారు. పేపర్ ప్లేట్స్‌కు బదులుగా స్టీల్ ప్లేట్స్ వాడుతామని ప్రతిజ్ఞ చేశారు. బుధవారం గ్రామ సంఘం ద్వారా 300 స్టీల్ ప్లేట్స్ 300 గ్లాస్‌లు తెప్పించి గ్రామంలో చిన్న చిన్న కార్యక్రమాలకు వీటికి ఉపయోగించాలని తర్వాత అన్ని ఫంక్షన్లకు సరిపోయేంతా ప్లేట్స్ తెస్తామని గ్రామ సంఘం తీర్మానం చేశారు. అదేవిధంగా మహిళా సంఘాలు చేసే కార్యక్రమాలకు గ్రామ వీడీసీ ఎప్పుడు సహాయం చేస్తుందని వీడీసీ చైర్మన్ ఎగ్గాం నర్సింహులు అన్నారు. డీపీవో శ్రీనివాస్, ఎంపీవో రహీం, ఏపీఎం అశోక్, ఏపీవో నవీన్, మాజీ సర్పంచ్ ఖనీష్ ఫాతిమా, మహిళా సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

ఖానాపూర్ రూరల్, అక్టోబర్ 2: ఖానాపూర్ మండలం సింగాపూర్ గ్రామ పంచాయతీలో ప్లాస్టిక్ వాడకాన్ని నిర్మూలించలని విందు వివాహాల కోసం గ్రామస్తుల కొరకు స్టీల్ ప్లేట్లను అందజేశారు.

లక్ష్మణచాంద, అక్టోబర్ 2: మండలంలోని పార్‌పెల్లి, బాబాపూర్, నర్సాపూర్, కంజర్ గ్రామాల్లో స్టీలు బ్యాంకులను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఎంపీడీవో రాధిక మాట్లాడుతూ ప్లాస్టిక్ వాడకాన్ని నిషేధించి పర్యావరణాన్ని కాపాడుకుందామని పిలుపునిచ్చారు. ఆయా గ్రామాల పంచాయతీ కార్యదర్శులు, మాజీ ప్రజాప్రతినిధులు, వివిధ యువజన సంఘాల నాయకులు పాల్గొన్నారు.

ప్లాజా ఉద్యోగులను ఎన్‌హెచ్‌ఏఐ ఉద్యోగులుగా గుర్తించాలి

నేరడిగొండ, అక్టోబర్ 2 : రోల్‌మామడ టోల్‌ప్లాజాలో పని చేస్తున్న ఉద్యోగులను ఎన్‌హెచ్‌ఏఐ ఉద్యోగులుగా గుర్తించాలని ఎంప్లాయిస్ యూనియన్ అధ్యక్షుడు నక్క లక్ష్మణ్ డిమాండ్ చేశారు. బుధవారం రోల్‌మామడ టోల్‌ప్లాజా కాంప్లెక్స్‌లో యూనియన్ సభ్యులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం మానిటైజేషన్ పైపులైన్‌లో భాగంగా ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటీకరిస్తున్నదన్నారు. ఎన్‌హెచ్‌ఏఐ టోల్ ఆపరేట్ ట్రాన్స్‌ఫర్ పేరుతో కంపెనీలకు నిర్ణీత కాలానికి అప్పజెప్పే ఒప్పందం చేసుకుంటుందని అన్నారు. ఇందులో రోల్‌మామడ టీఓటీ ఉన్నదని, దీనికి ముందు ఇందులో పని చేసే ఉద్యోగులను ఎన్‌హెచ్‌ఏఐ ఉద్యోగులుగా తీసుకోవాలన్నారు. ఉద్యోగ భద్రత కల్పిస్తూ, గుర్తింపు కార్డులు ఇవ్వాలన్నారు. పింఛన్, ఇన్సూరెన్స్ కల్పిస్తూ, కనీస వేతనం రూ.26 వేలు చెల్లించాలని డిమాండ్ చేశారు. లేబర్‌కోడ్‌లను రద్దు చేసి, కార్మిక చట్టాలను ఎనిమిది గంటల పని దినాన్ని పునరుద్దరించాలని డిమాండ్ చేశారు. లేనిచో రానున్న రోజుల్లో ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. సమావేశంలో ప్రధాన కార్యదర్శి రాజశేఖర్‌రెడ్డి, కోశాధికారి శేక్ అహ్మద్, ఉపాధ్యక్షుడు గోవన్‌సింగ్, రమేశ్, నాయకులు సురేందర్‌సింగ్, యూనియన్ సభ్యుల పాల్గొన్నారు.

14లోగా ఏకరూప దస్తులు అందజేయాలి

ఎదులాపురం, అక్టోబర్ 2 : ఆదిలాబాద్ జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలలు, బీసీ, ఎస్సీ, మైనార్టీ రెసిడెన్షియల్ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు ఏక రూప దుస్తులు ఒక జత ఈ నెల 14వ తేదీ లోగా అందజేయుటకు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ రాజర్షి షా అన్నారు. బుధవారం కలెక్టర్ రాజర్షి షా తన క్యాంపు కార్యాలయంలో సంబంధిత అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళా శక్తి కుట్టు కేంద్రాల ద్వారా ఆయా పాఠశాలలకు సంబంధించిన ఏకరూప దుస్తుల స్టిచింగ్ ఆయా శాఖలకు చేరుకున్న క్లాత్‌ను విద్యార్థుల వారీగా కొలతలు తీసుకుని, మహిళా శక్తి కుట్టు కేంద్రాలకు దుస్తులు కుట్టుటకు అప్పగించాలని డీఆర్‌డీఏ పీడీ సాయన్నను ఆదేశించారు. అలాగే బేల, జైనథ్, నర్సాపూర్, బట్టి సావర్గాం, స్కూల్స్‌కు సంబంధించి ఒక జత అక్టోబర్ 14 లోపు ఏకరూప దుస్తులు అందించాలని మిగతా 2, 3 జతల ఏకరూప దుస్తులు ఈ నెల 25 లోగా అందించాలని తెలిపారు. విద్యార్థులకు ఏకరూప దుస్తులు స్టిచింగ్ పై గడువులోగా పూర్తి కావాలన్నారు నిర్లక్ష్యం వహించకుండా సకాలంలో పూర్తి చేసి విద్యార్థులకు అందించాలని తెలిపారు. కార్యక్రమంలో సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

అక్రమ లే అవుట్లపై స్పందించిన పంచాయతీ అధికారులు

బేల, అక్టోబర్ 2: భురాన్‌పూర్ శివారులోని సర్వే నంబర్ 29/ఏలో అక్రమంగా నిర్మాణం చేపట్టిన భవనాలు, గుడిసెలు తొలగించాలని కోరుతూ రెండు సంవత్సరాల మండలంలోని తొమ్మిది తెగల ఆదివాసీ సంఘాల నాయకులు బుధవారం పంచాయతీ అధికారిని వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కొలాం హక్కుల పోరాట సమితి జిల్లా అధ్యక్షుడు గోవింద్ రావ్ మాట్లాడుతూ మండల కేంద్రంలో మాజీ ఎమ్మెల్యే బాపురావ్ భురాన్‌పూర్ శివారులోని సర్వే నంబర్ 29/ఏ అక్రమంగా లే అవుట్ వేసి గిరిజనేతరులకు అమ్మడం జరిగిందన్నారు. రెండేళ్ల నుంచి అధికారులకు తెలిపిన పట్టించుకోవడం లేదన్నారు. తొమ్మిది తెగల ఆదివాసీ సంఘాలతో చర్చించి తమ కార్యాచరణ ప్రకటిస్తామని తెలిపారు. ఇక నుంచి మండల కేంద్రంలో ఆదివాసీ సంఘాలతో ధర్నాలు, రాస్తారోకో చేపడతామని, దీనికి బాధ్యులు సంబంధిత అధికారులదేనని పేర్కొన్నారు. ఆదివాసీ సంక్షేమ పరిషత్ మండలాధ్యక్షుడు నందుకుమార్, రాయి సెంటర్ అధ్యక్షుడు సోనేరావ్, సహాయ కార్యదర్శులు సంతోష్, సభ్యులు పాల్గొన్నారు.